

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
మంగళవారం | 18 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 7

# యస్.బి.ఐ.టి లో ఘనంగా ఓరియన్‌టేషన్ ప్రోగ్రాం

**ఆలోచింపచేసిన గరికపాటి సలహాలు సూచనలు**

**అజ్ఞానాన్ని పారద్రోలే ఏకైక ఆయుధం విద్య - గరికపాటి**




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గురువులను, తల్లిదండ్రులను గౌరవించటం విద్యార్థులు అలవరుచకోవాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహాసహస్ర అవధాని గరికపాటి నరసింహారావు తెలిపారు.సోమవారం స్థానిక యస్.బి.ఐ.టి. కళాశాలలో నిర్వహించిన మొదటి సంవత్సర విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాంలో విశిష్ట అతిధిగా పాల్గొన్న గరికపాటి తల్లిదండ్రులు మరియు గురువుల ప్రాముఖ్యతను గురించి

మిగతా 2 లో...




# ముసాయిదా ఓటరు జాబితా విడుదల క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సెప్టెంబర్ 16 వరకు అవకాశం

**ఖమ్మం జిల్లాలో 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల**

**1,76,135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు**

**ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం**

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** సోమవారం ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామని, క్లెయిమ్‌లు,అభ్యంతరాలు ఏమైనా ఉంటే సెప్టెంబర్ 16 లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ, ముసాయిదా ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితా, గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ లేని ఓటర్ల వివరాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీక

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

రణ, పరిష్కార ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల

మిగతా 2 లో...

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



**పాత్రికేయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి**

**మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేయడం సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు.సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు.

**కేబుల్, ఐపీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ ఇవ్వాలి**

రాష్ట్రంలోని అన్ని కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. అదేవిధంగా

మిగతా 2 లో...

# యాంటీబయాటిక్స్ ను వైద్యుల సూచన మేరకే వినియోగించాలి

**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డిరామారావు,**

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి**
యాంటీబయాటిక్స్ ను అవసరం ఉన్నప్పుడు మాత్రమే, వైద్యుల సూచన మేరకు సరైన మోతాదులో, నిర్ణయించిన కాలవ్యవధి వరకు వినియోగించాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి ప్రజలకు సూచించారు. సాధారణ జలుబు, ఫ్లూ వంటి వైరస్ ల వల్ల కలిగే అనేక ఇన్ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ పనిచేయ



వని తెలిపారు. వైరల్ ఇన్ఫెక్షన్లకు స్వయంగా యాంటీబయాటిక్స్ తీసుకోవడం వల్ల ప్రయోజనం లేకపోవడంతో పాటు, యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ పెరిగినప్పుడు సాధారణంగా చికిత్సతో నయం అయ్యే బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు కూడా చికిత్సకు స్పందించకపోవచ్చని తెలిపారు. దీనివల్ల వ్యాధి ఎక్కువకాలం కొనసాగడం,ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితులు మరియు చికిత్స ఖర్చులు పెరగడం వంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు,ప్రజలు పాటించాల్సిన ముఖ్య సూచనలు:– వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్స్ ను కొనుగోలు చేసి వాడకూడదు,ఇతరులకు సూచించిన

మిగతా 2 లో...

# బీఆర్ఎస్ దొంగ నాటకాలు సిగ్గుచేటు

**కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామకోటేశ్వర రావు**

**రైతుల పొలాల్లో మన్ను చల్లి**

**నేడు కన్నీళ్లు కారుస్తున్న లింగాల కమల్ రాజ్**

**నాడు భూములు గుంజుకొని.. నేడు డిప్యూటీ సీఎం భట్టిపై బురద జల్లడమేంటి**




**బోనకల్, ఆగస్టు 17 (ప్రజా జ్యోతి):** తన పదేళ్ల పాలనలో రైతుల ఉసురుపోసుకుని, అధికార మదంతో నోళ్లు నొక్కిన బిఆర్ఎస్ పార్టీ, నేడు అధికారం పోగానే దొంగ ఏడుపులు ఏడుస్తుండటం సిగ్గుచేటని బోనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. బోనకల్ మండలం ఆళ్ళపాడు–రాయన్నపేట గ్రామాల మధ్య ఉన్న జాలిమూడి కాలువ పూడికతీత పనులను

మిగతా 2 లో...

# ముసాయిదా ఓటరు జాబితా విడుదల క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సెప్టెంబర్ 16 వరకు అవకాశం

(మొదటి పేజీ తరువాయి...)
జాబితా విడుదలైందన్నారు. ఇందులో 5,24,894 మంది పురుష, 5,60,973 మంది మహిళా, 60 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు.ముసాయిదా ఓటర్ల జాబితాలో 1,33,004 మంది అంటే 12.24 శాతం ఓటర్లను అనామలీస్ గుర్తించగా, 43,131 మంది అంటే 3.97 శాతం ఓటర్లకు మ్యాపింగ్ కానట్లు గుర్తించినట్లు మొత్తం 1,76,135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు.నోటీసులు అందుకున్నవారు సంబంధిత పత్రాలు సమర్పించాలి.నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ ఆధారంగా భారత ఎన్నికల సంఘం సూచించిన పత్రాల్లో సంబంధిత పత్రాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు పరిశీలించుకోవాలి. ఆగస్టు 17న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేనట్లయితే బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా ఎన్నికల నమోదు అధికారిని సంప్రదించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ సీఈఓతెలంగాణ.నైస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ముసాయిదా జాబితాలో పేరు లేనట్లయితే లేదా వివరాల్లో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే సెప్టెంబర్ 16,2026లోగా అభ్యంతరాన్ని సమర్పించవచ్చని తెలిపారు.అదేవిధంగా అర్హత కలిగిన కొత్త ఓటర్లు ఫారమ్-6 ద్వారా సెప్టెంబర్ 16లోగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అన్నారు. అర్హులైన కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చు. ప్రస్తుతం కూడా అర్హులైన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. 2026 అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఏ శాసనసభ నియోజక వర్గంలోనూ ఓటరుగా నమోదు కాకపోతే ఫారమ్-6 ద్వారా తాజా ఫొటో, వయస్సు ధృవీకరణ పత్రం, డిక్లరేషన్ తదితరాలను జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. చనిపోయిన లేదా డూప్లికేట్ ఓటర్లపై అభ్యంతరాలు తెలియజేయడానికి ఫారమ్-7,మొబైల్ నంబర్ నవీకరణ, చిరునామా మార్పు, ఓటరు గుర్తింపు కార్డులో వివరాల సవరణలకు ఫారమ్-8 వినియోగించుకోవచ్చని వివరించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సెప్టెంబర్ 16వరకు అవకాశం.ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాపై ఆగస్టు 17నుంచి సెప్టెంబర్ 16వరకు క్లెయిమ్‌లు,అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియ ఆగస్టు 17నుంచి అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని చెప్పారు. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగం గా తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19, 2026న ప్రరించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకునేలా సహకరించాలని సూచించారు. ఎస్ఐ ఆర్‌కు సంబంధించిన వివరాల కోసం బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎన్నికల నమోదు అధికారులను సంప్రదించవచ్చని, అలాగే టోల్‌ఫ్రీ 1950కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డిసి సదానందం,ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, బీ.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధులు బి.వేణుగోపాల్, సతీష్ బాబు,ఎం.రమేష్, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్,సిపిఎం డి.తిరుపతి రావు, కె.ప్రకాశం, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు,సిహెచ్ నవీన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఏ.గోపాల రావు, జి.సూర్య నారాయణ, బిఎస్పీ వేల్పుల రామయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ దొంగ నాటకాలు సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి...)
అడ్డుకుంటూ బిఆర్ఎస్ నాయకుడు లింగాల కమల్ రాజ్ రైతులను ముందు బెట్టి ఆడుతున్న నాటకాలపై శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన విరుచుకుపడ్డారు. 2013లో మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్ గా ఉన్న సమయంలోనే రైతుల ప్రయోజనాల కోసం జాలిమూడి కాలువ తవ్వకానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అయితే ఆ సమయానికి పరిహారం పంపిణీ పూర్తికాకపోవడంతో పనులు నిలిచాయని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ నేతలు తమ కడుపు నింపుకోవడానికి దౌర్జన్యాలకు తెగబడ్డారని ఆరోపించారు. తమ పెద్దల అధికార బలంతో రైతులకు కాపలా పెట్టి నిర్బంధించి, పైసా పరిహారం ఇవ్వకుండా, బెదిరించి దౌర్జన్యంగా భూములను లాక్కున్న నీచ చరిత్ర బిఆర్ఎస్ దేనని మండిపడ్డారు.

**అప్పటి మంత్రులు, కమల్ రాజ్ తిరిగినా కనికరించని ద్రోహులు**

"అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లూ కమల్ రాజ్ ఏం చేశారో కమల్ రాజు సమాధానం చెప్పాలని రామకోటేశ్వరరావు సవాలు విసిరారు. తమ భూములకు పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కమల్ రాజ్ ఇంటి చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా, వారిని కనీసం మనుషులుగా కూడా చూడకుండా గెంటేసిన ద్రోహులు నేడు రైతు రక్షకుల్లా నటిస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నాడు రైతులకు తీవ్ర అన్యాయం చేసి, వారికి దక్కాల్సిన హక్కులను కాలరాసిన టిఆర్ఎస్ నేతలకు, నేడు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేనేలేదని స్పష్టం చేశారు.

**ఇది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.. ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం**

నేడు రాష్ట్రంలో ఉన్నది ప్రజల, రైతుల కాంగ్రెస్ ప్రభుత్వమని.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో ప్రతి పేదవాడికి, రైతుకు పార్టీలతో సంబంధం లేకుండా న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ నేతలు చేసిన పాపాలను కడిగేసి, జాలిమూడి కాలువ బాధిత రైతులకు పరిహారం అందేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన న్యాయం జరిపిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా తమ రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను వాడుకోవడం మానకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు, ఆత్మ కమిటీ డైరెక్టర్ కందుల పాపారావు, మాజీ జడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబుతో పాటు పలువురు కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యస్.బి.ఐ.టి లో ఘనంగా ఓరియన్‌టేషన్ ప్రోగ్రాం

(మొదటి పేజీ తరువాయి...)
విద్యార్థులకు అవగాహన కలిగించారు.విద్యార్థులు ఫోన్లు, టెలివిజన్ వంటి వ్యాపకాలు మాని వారంలో 2 రోజులు డిజిటల్ ఉపవాసం అలవర్చుకోవడం ద్వారా విద్యపై దృష్టిని కేంద్రీకరించగలమని వెల్లడించారు. మోయలేని భారం వల్లనే ఒత్తిడి పెరుగుతుందన్నారు.గురువులతో చర్చించడంతో ఎలాంటి ఒత్తిడినైనా జయించవచ్చని తెలిపారు. విద్యను అభ్యసిస్తూనే దేశ అభివృద్ధి గురించి ఆలోచించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గరికపాటి విద్యార్థులతో ముఖాముఖి చర్చించి వారితో ప్రశ్నోత్తరాలలో పాల్గొన్నారు.కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ యస్.బి.ఐ.టి. లో ఉన్నతమైన విద్యా ప్రమాణాలు పాటించటంతో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించటంలో నిర్విరామంగా కృషి చేస్తున్నామని, కళాశాల పొందిన న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్, యు.జి.సి అటానమస్ హోదా దీనికి నిదర్శనం అని, ఈ విద్యా సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 100 శాతం అడ్మిషన్‌లు కలిగిన కళాశాలగా నిలవటం ఎంతో గర్వానీయమని ఇది మా కళాశాలపై భాధ్యతను పెంచిందని, తల్లిదండ్రుల నమ్మకానికి అనుగుణంగా విద్యార్థులు అభివృద్ధి చేందేందుకు తాము సాయశక్తుల కృషి చేస్తామని వెల్లడించారు.మన దేశంలో ఏటా 15 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేస్తుండగా కేవలం 1.5 లక్షల మంది మాత్రమే ఉద్యోగాలు పొందుతున్నారని మిగిలిన వారు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, ఈ పరిణామాలకు అనుగుణంగా మా విద్యార్థులకు కోడింగ్,రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ మొదలగు శిక్షణా కార్యక్రమాలను, ఇంటర్న్‌షిప్స్, ఫస్ట్ ఇయర్ నుంచే నిర్వహిస్తున్నామని తద్వార బహుళజాతి కంపెనీలలో అత్యధిక ప్లేస్‌మెంట్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి విశ్లేషించారు.విలువలతో కలిగిన విద్యనందించటంలో తమ కళాశాల అహర్నిసలు కృషి చేస్తుందని కళాశాల వైస్-ఛైర్మన్ కె.శ్రీచైతన్య తెలిపారు.విద్యార్థులు పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక విప్లవమైన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్ మొదలగు రంగాలలో ఆసక్తిని పెంచుకొని నైపుణ్యాలను పెంచుకోవటంలో ధృడ సంకల్పం కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపల్ డా జి. రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రుల తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, హెచ్.ఒ.డిలు, డా కె. అమిత్ భిందాజ్, డా టి. చరణ్ సింగ్, డా కె. స్ఫూర్తి, డా యమ్. సుప్రియ మీనన్, డా యమ్. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి...)
ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) ఆధారిత న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.కేబుల్ ఛానళ్లకు జిల్లాస్థాయిలో నాలుగు, రాష్ట్రస్థాయిలో 12 అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

**జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు**

అక్రెడిటేషన్ కార్డులు మంజూరవుతున్నప్పటికీ జర్నలిస్టులకు హెల్త్ కార్డుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫెడరేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు**

సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ప్రభుత్వం చట్టపరమైన మార్గాలను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఈ పథకంలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రత్యేకంగా సహాయం, సంక్షేమ చర్యలు అందించాలని కోరారు.ప్రకటనల పెండింగ్ బిల్లులు చెల్లించాలి.చిన్న, మధ్యతరహా పత్రికలకు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు.చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వ ప్రకటనల ఎంపానెల్‌మెంట్‌లో చేర్చి వాటి మనుగడకు సహకరించాలని కోరారు.రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సీనియర్, రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని ఫెడరేషన్ కోరింది. జర్నలిస్టుల పిల్లలు ఎంతవరకు చదువుకున్నా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది.అలాగే జర్నలిస్టులందరికీ ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, జర్నలిస్ట్ మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం అందించే విధంగా పథకాన్ని అమలు చేయాలని కోరారు.జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు.మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్,కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్.రవికుమార్ తదితరులు ఉన్నారు.

## యాంటీబయాటిక్స్ ను వైద్యుల సూచన మేరకే వినియోగించాలి

(మొదటి పేజీ తరువాయి...)
యాంటీబయాటిక్స్ ను తాము ఉపయోగించకూడదు అని– వైద్యుడు సూచించిన మోతాదు మరియు సమయపట్టికను కచ్చితంగా పాటించాలని ,వైద్యుడు సూచించిన కోర్సును మధ్యలో స్వయంగా నిలిపివేయకూడదు,మిగిలిపోయిన యాంటీబయాటిక్స్ ను భవిష్యత్తులో స్వయంగా ఉపయోగించకూడదుఅని, జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి ప్రతి అనారోగ్యానికి యాంటీబయాటిక్స్ అవసరం ఉండదని గుర్తించాలి అని,యాంటీబయాటిక్స్ వినియోగంపై సందేహాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి అని,వైద్యులు కూడా సరైన నిర్ధారణ ఆధారంగా అవసరమైన సందర్భాల్లో మాత్రమే యాంటీబయాటిక్స్ ను సూచించాలని, ప్రజలకు వాటి బాధ్యతాయుత వినియోగంపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య & ఆరోగ్య శాఖాధికారి సూచించారు,యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికడదాం, యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ను తగ్గిద్దాం–భవిష్యత్ తరాలకు సమర్థవంతమైన చికిత్సను కాపాడుదాం" అని ఆయన పేర్కొన్నారు.

## ఆగస్టు 19న దిశ సమావేశం నిర్వహణ

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఆగస్టు 19న బుధవారం మధ్యాహ్నం 2.00 గంటలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై జిల్లా అభివృద్ధి,సమన్వయ,పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆగస్టు 19న జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిశ కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించు దిశ సమావేశానికి గౌరవ సభ్యులు అందరూ హాజరు కావాలని, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## హెచ్ఐవీ, ఎస్టీఐలపై అవగాహనతో పాటు

# సకాలంలో పరీక్షలు చేయించుకోవాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఇండియా ఫైట్స్ హెచ్ఐవీ అండ్ ఎస్టీఐ ప్రచార పోస్టర్ ఆవిష్కరణ**

**గోప్యమైన స్వీయ అంచనా కోసం క్యూఆర్ కోడ్ వినియోగించుకోవాలి**

**1097 జాతీయ ఎయిడ్స్ హెల్ప్‌లైన్ ద్వారా ఉచితంగా గోప్యమైన సహాయం పొందవచ్చు**



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** హెచ్ఐవీ, ఎస్టీఐలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు, అనుమానం ఉన్నప్పుడు సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు,సకాలంలో పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించేందుకు చేపడుతున్న ఇండియా ఫైట్స్ హెచ్ఐవి అండ్ ఎస్టీఐ ప్రచారంలో భాగంగా రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ హెచ్ఐవీ లేదా ఎస్టీఐలకు సంబంధించి ఏవైనా సందేహాలు,అనుమానాలు ఉన్నవారు ఆలస్యం చేయకుండా తమ ఆరోగ్య పరిస్థితిపై అవగాహన పొందాలని సూచించారు.అవసరమైన వారు సకాలంలో పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనల మేరకు తగిన చికిత్స, సేవలు పొందాలని తెలిపారు.క్యూఆర్ కోడ్ ద్వారా గోప్యమైన స్వీయ అంచనా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బ్రేక్ ఫ్రీప్రచారంలో భాగంగా హెచ్ఐవీ, ఎస్టీఐలకు సంబంధించిన డిజిటల్ స్వీయ అంచనా సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.అధికారిక ప్రచార పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి, వ్యక్తిగత ఆరోగ్యం, వ్యాధుల బారిన పడే ప్రమాదానికి సంబంధించిన సులభమైన ప్రశ్నలకు గోప్యంగా సమాధానాలు ఇవ్వడం ద్వారా స్వీయ అంచనా చేసుకోవచ్చని వివరించారు.స్వీయ అంచనా అనంతరం అవసరమైన నివారణ చర్యలు, ఆరోగ్య సంబంధిత మార్గదర్శకాలు,సమీపంలోని పరీక్షా కేంద్రాలు,ఇతర వైద్య సేవల వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 1097 జాతీయ ఎయిడ్స్ హెల్ప్‌లైన్ ద్వారా సేవలు హెచ్ఐవీ, ఎస్టీఐలకు సంబంధించిన సందేహాలు,సమాచారం లేదా సహాయం కోసం 1097 జాతీయ టోల్‌ఫ్రీ ఎయిడ్స్ హెల్ప్‌లైన్ ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. ఈ సేవ ద్వారా గోప్యంగా, ఉచితంగా అవసరమైన సమాచారం,మార్గదర్శకత్వం పొందవచ్చని పేర్కొన్నారు. హెచ్ఐవీ,ఎస్టీఐలపై అపోహలు, భయాలను తొలగించి ప్రజల్లో సరైన అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డా.రాజశేఖర్, వైద్యాధికారులు,జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం రైతుగా కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి

**తాసిల్దార్ కు వినతి పత్రం**



**రఘునాధపాలెం, ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వం స్వదేశీయ విదేశీయ కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా రైతు కార్మిక ప్రజలకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అమెరికన్ బ్రిటన్ న్యూజిలాండ్ యూరోపియన్లతో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ ఒప్పందాలు చేసుకున్నది దీన్ని వ్యతిరేకంగా దేశంలోని రైతులు మరియు శ్రామిక ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర వ్యవసాయ ఆర్థిక సామాజిక సంక్షోభంపై మేధావులు అనేక సార్లు చెప్పిన కూడా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టి రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తీసుకొచ్చి రైతులపై రుద్దుతా ఉంది రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా ఆఫ్ ఆన్లైన్ ద్వారా ఇవ్వాలని ప్రవేశపెట్టిన ఆన్లైన్ విధానాల్ని రద్దుచేసి రైతులకు సులభంగా యూరియాని ఇచ్చేటట్టు చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు.కే లోతు .లక్ష్మణ్ డిమాండ్ చేశారు పై డిమాండ్లపై సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు రఘునాథపాలెం మండలం తాసిల్దార్ వినతిపత్రం ఇవ్వడం అయినది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చరిత్రాత్మక రైతు పోరాటం సందర్భంగా 2021 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పి రుణమాఫీ విద్యుత్ ప్రైవేటీకరణ మరియు రైతులపై కేసుల ఉపసంహరణ పై ఇచ్చిన లిఖితపూర్వక హామీలను అమలు చేయకపోవడంపై వీరు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ఢిల్లీ సరిహద్దుల్లో 385 రోజుల పాటు కొనసాగిన నిరంతర భారీ మహా పడాన్ పోరాటం శాంతియుత ఉద్యమం జరిగిందన్నారు ఈ ఉద్యమంలో 736 మంది అమరులయ్యారని ఆ అమరవీరుల ప్రాణత్యాగం నేపధ్యంలో 2020 నవంబర్ లో ఏర్పడిన నుండి అన్ని పంటలకు సేకరణతో కూడిన చట్టబద్ధమైన 50% ఎంఎస్పి గ్రామీణ రుణభారాన్ని మరియు తాత్కాలికంగా జరుగుతున్న రైతులు దినసరి కూలీల ఆత్మహత్యలను అంతం చేసేందుకు సమగ్ర రుణమాఫీ మరియు విద్యుత్ ప్రవేటికనునకు అడ్డుకోవడం అనే ప్రధాన డిమాండ్లను సాధించేవరకు ఎస్కేయం పోరాట మార్గంలో అలుపెరగకుండా ఉద్యమం కొనసాగుతుందన్నారు స్వతంత్రం అనంతరం జరిగిన అతిపెద్ద ప్రజా పోరాటమైన శ్రామిక వర్గ ఉద్యమం ఎన్డీఏ నితిన్ లోని మోడీ ప్రభుత్వం ఏ హామీలను అమలు లేదన్నారు శ్రామిక ప్రజలపై పెరుగుతున్న కార్పొరేట్ దాడి గత 12 సంవత్సరాలుగా అధికారుల్లో ఉన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గిట్టుబాటు ధర ఫార్ములకు చట్టబద్ధమైన హామీ కల్పిస్తామని 2014లో బిజెపి ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన వాగ్దానాలను నిరాకరిస్తూ పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించడానికి నిరాకరిస్తూ కౌలు రైతులకు మరియు వ్యవసాయ కూలీలకు సంపూర్ణ కేంద్ర రుణమాఫీని నిరాకరిస్తూ మొత్తం రైతన్న నిరంతరం మోసం చేస్తూనే 16 లక్షల కోట్ల కార్పొరేట్ బకాయిలను రద్దు చేసింది అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం డివిజన్ కార్యదర్శి ధరావత లక్ష్మణ్, జరపలదేవుల కూరాకుల నరసయ్య,గోనగంటి వీరబాబు,నాగం సూర్యనారాయణ, పుప్పాల రామారావు, మేక రామనాథం,కేలుతు వెంకన్న, ఆడేపు సత్యం, పిఓడబ్ల్యు, ఖమ్మం డివిజన్ అధ్యక్షురాలు ఇస్లావత్,స్వాతి, షేక్, మదారి సాహెబ్ పాల్గొన్నారు.

## చిన్నారికి ‘జస్వికశ్రీ’ అని నామకరణం చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి :** ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన కాంపాటి రాకేష్, మాధవి దంపతులకు 2026 మే 9న ఆడబిడ్డ జన్మించింది. జన్మించిన 12 రోజుల అనంతరం చిన్నారి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. చిన్నారి వైద్య చికిత్సకు పెద్ద మొత్తంలో ఖర్చు అవసరం కావడంతో ఆ కుటుంబం ఆందోళనకు గురైంది.ఈ విషయాన్ని ఖమ్మం నగరపాలక సంస్థలో శానిటేషన్ విధులు నిర్వహిస్తున్న చిన్నారి నానమ్మ నరసమ్మ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకువచ్చారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న కమిషనర్ వెంటనే స్పందించి,హృదయ స్వచ్ఛంద సంస్థతో పాటు ప్రభుత్వ సహకారంతో చిన్నారి గుండె శస్త్రచికిత్సకు అవసరమైన రూ.14 లక్షల ఆర్థిక సహాయం మంజూరయ్యేలా కృషి చేశారు.ఈ సహాయంతో జూలై 28న చిన్నారికి గుండె శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించగా,ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా కోలుకుంది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు తమ కుమార్తెను మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి తీసుకువచ్చి,గ్రీవెన్స్ కార్యక్రమంలో తమకు అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.చిన్నారికి మున్సిపల్ కమిషనర్ పేరు పెట్టాలని కుటుంబ సభ్యులు కోరగా, కమిషనర్ అభిషేక్ అగస్త్య సంతోషం వ్యక్తం చేస్తూ చిన్నారికి ‘జస్వికశ్రీ’ అని నామకరణం చేశారు. చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో,సంతోషంగా ఎదగాలని కమిషనర్ ఆకాంక్షించారు.ఆపదలో ఉన్న కుటుంబానికి సకాలంలో స్పందించి వైద్య సహాయం అందేలా కృషి చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్యకు చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆస్థి అనుభవిస్తూ...



**అన్నం పెట్టకుండా బయటకు గెంటేశారు.**

**ఈ పంతులమ్మ ఉంటే పిల్లలను బడికి పంపం.**

**16 దరఖాస్తులు...8 తక్షణ పరిష్కారం.**

**ప్రజావాణి లో వినతుల వెల్లువ...**

**నేలకొండపల్లి, ఆగస్టు 17 ప్రజా జ్యోతి :** తన కుటుంబ సభ్యులు ఆస్తిని అనుభవిస్తూ అన్నం పెట్టకుండా...ఇంటి నుంచి బయటకు గెంటేశారని ఓ వృద్ధురాలు అధికారులకు విన్నవించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కి పలు సమస్యల పై వినతులు అందించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ యం.యర్రయ్య అధ్యక్షతన ప్రజావాణి ని స్వీకరించారు. చెన్నారం గ్రామానికి చెందిన సీతమ్మ అనే వృద్ధురాలు తనకున్న రెండు ఎకరాలను స్వాధీనం చేసుకుని.. తను అన్నం కూడ పెట్టకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టారని ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కోనాయిగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితాకుమారి పేరెంట్స్ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరించటమే కాకుండా విద్యార్థుల పై చెయ్యి చేసుకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలో జరిగే పంక్షన్ లకు విద్యార్థులను బోజనాలకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు చదువు చెప్పకుండా...నిర్లక్ష్యంగా వ్యవహారించటంతో పాటు నిత్యం సెలవులు పెడుతున్నారని...విద్య పట్ల నిర్లక్ష్యంగా చూపే ఉపాధ్యాయురాలని మార్చకుంటే తమ పిల్లలను బడికి పంపకుండా తాము ప్రవేట్ కు పంపుతామని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన పేరెంట్స్ బొడ్డు ప్రమీలా, ఉపేందర్, చెరుకుపల్లి రాజేష్ తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాంప్రసాద్, మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఎంపీడీవో యర్రయ్య కు ఘన సన్మానం



**నేలకొండపల్లి, ఆగస్టు 17 ప్రజా జ్యోతి :** జిల్లా ఉత్తమ ఎంపీడీఓ గా అవార్డు అందుకున్న నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య ను పలువురు ఘనంగా సన్మానించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...మండలం లో ప్రభుత్వ పధకాల అమలు లో ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, సుల్తాన్ వీరబాబు, కడియాల నరేష్, కొండమీది వెంకన్న.. సోమనబోయిన సాయినవీన్, షేక్ లాల్పాషా, గడిపల్లి నవీన్.. బచ్చలకూరి వీరబాబు. విష్ణు తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ ను సర్పంచ్ ల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ను నిర్వహించారు. మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శి లు రాయపూడి రామారావు, దుద్దెల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహణ

### జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ,యువకులకు ప్రైవేట్ రంగం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (LIC), ఇండస్ఇండ్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఖమ్మం కీర్తన గోల్డ్ లోన్స్ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించుటకు బుధవారం ఉదయం 10.00 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ కు ఎదురుగా ఉన్న టీటీడీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్.మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ అడ్వైజర్ (50) ఉద్యోగాలకు ఎస్సెస్సి, ఇంటర్, ఏదేని డిగ్రీ అర్హత గల 18–40 మధ్య వయస్సు గలవారు, ఇండస్ఇండ్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ 20 ఉద్యోగాలకు ఏదేని డిగ్రీ అర్హత గల 18–30 వయస్సు గల మహిళా అభ్యర్థులు, ఖమ్మం కీర్తన గోల్డ్ లోన్స్ కంపెనీ లో లోన్ ఆఫీసర్, రిలేషన్షిప్ ఆఫీసర్ 25 ఉద్యోగాలకు ఏదేని డిగ్రీ అర్హత గల 18–30 వయస్సు గల వారు అర్హులని తెలిపారు.ఎంపికైన వారికి వేతనం 10 వేల నుండి 50 వేల వరకు ఉంటుందని తెలిపారు. మొత్తం 95 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు,ఆసక్తి అర్హత గల నిరుద్యోగ యువతీ,యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు హెచ్ ఆర్ సెల్ నెంబర్ 8143420505, 9618890879, 8106790700 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కొత్తూరు కి రింగ్ రోడ్డు కావాలని ప్రజావాణిలో వినతి... పాలకవర్గం



**సత్తుపల్లి ఆగస్టు17(ప్రజా జ్యోతి)** ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఆదేశాల మేరకు,ప్రతి సోమవారం ప్రజావాణి ను ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేయాలని కార్యచరణ అమలు చేయగా, సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చిన్న నాగేశ్వరావు, మున్సిపల్ కమిషనర్ నరసింహ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు పాలకవర్గం సర్పంచ్ అయినంపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొర్లమారి రామ్మోహన్ రెడ్డి సత్తుపల్లి నుంచి విజయవాడ వైపు వెళ్లే రోడ్డు కొత్తూరు మొదట మలుపు వద్ద ఒక గోడను ఆర్ అండ్ బి అధికారులు నిర్మించారు. అది గ్రామస్తులకు ఇబ్బంది కలగడంతో పాలకవర్గ సభ్యులు రింగ్ రోడ్డు కావాలని వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం చేసిన వారిలో పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ప్రెస్ మీట్ పాయింట్స్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ప్రెస్ మీట్ లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేతలు అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత తుమ్మల నాగేశ్వర రావు అని నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న మచ్చలేని నాయకుడని,తుమ్మల నాగేశ్వరరావు పై అసత్య ప్రచారం ఆకాశంలో ఉమ్మి వేసిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. అదే విధంగా ఖమ్మం నియోజకవర్గం లోని రఘునాథపాలెం మండలానికి గోదావరి జలాలు తీసుకొచ్చారని,వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ,కేబుల్ బ్రిడ్జి నిర్మాణం,ఇంటిగ్రేటెడ్ స్కూలు చెప్పుకొంటూ పోతే కోకొల్లలని అన్నారు ఇప్పటికైనా అవాకులు చెవాకులు మాని అభివృద్ధికి సహకరించాలని అన్నారు.అదే విధంగా ప్రజాపాలన గావిస్తున్న ప్రజా ప్రభుత్వ రథసారథి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు,రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మరియు సహచర మంత్రి వర్గ సహచరులతో కలిసి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ పువ్వాడ అజయ్ కుమార్ అరాచకాలు,కబ్జాలకు బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు,శుద్ధపూస మాటలు మనాలని హితవు పలికారు.మీరు మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని రాబోవు కార్పొరేషన్ ఎన్నికలలో మీకు బుద్ధి చెప్పటానికి ప్రజలు వేసి చూస్తున్నారని అన్నారు.రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ బి ఆర్ ఎస్ నాయకులు అనేక శాఖలను భ్రష్టు పట్టించిన మీరా మా నాయకుల గురించి మాట్లాడేది అని ఎద్దేవా చేశారు, మీరు చేసే ఆరోపణలపై ఆధారాలు ఉంటే వాటికి అనేక ప్లాట్ ఫామ్ లు ఉన్నాయని,ఊసరవెల్లి లాగా పార్టీలు మారిన నీవు మాట్లాడుతున్న మాటలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజలు సంతోషంగా ఉన్నారని మీ గాలి నమ్మే పరిస్థితిలో ఖమ్మం ప్రజలు లేరని ఎద్దేవా చేశారు.సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పువ్వాడ అజయ్ కుమార్ ఏమీ మాట్లాడక పోతే వెనుకబడి పోతానని ప్రజా పాలన గావిస్తున్న ప్రభుత్వం,నాయకులపై అవాకులు,చెవాకులు మానుకోవాలని హితవు పలికారు. మీ పాలనలో జరిగిన అరాచకాలు చేసి,అప్పులు పాలు చేసి సంస్థలను నిర్వీర్యం చేసిన మీరు మాట్లాడే మాటలు ప్రజలు గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో మీకు మరో గుణపాఠం చెపటానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా మాట్లాడుతూ రాజకీయ విమర్శలు సహజం కాని వ్యక్తి దూషణలు దిగటం సరికాదని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,కె కె సి అధ్యక్షులు విప్లవ కుమార్,జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు గాదె ఝూన్సీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ సన్న బియ్యం నే తినాలనే ప్రభుత్వం లక్ష్యం



**నేలకొండపల్లి, ఆగస్టు 17 ప్రజా జ్యోతి:** ప్రతీ ఒక్కరూ సన్న బియ్యం ను తినాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్న బియ్యం ను అందిస్తుందని రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు పేర్కొన్నారు. మండలం లోని రాయగూడెం లో మూడు నెలల ఉచిత సన్న బియ్యం ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ప్రతీ పేదోడు కూడ సన్న బియ్యం ను అందరితో పాటు తినాలని ఉద్దేశ్యంతో బియ్యం ను అందిస్తున్నట్లు తెలిపారు. పీడీఎస్ బియ్యం ను విక్రయాలు చేయకుండా పేదలు తినాలని సూచించారు. ఎవరైనా గ్రామంలోకి పీడీఎస్ బియ్యం కోనే వ్యాపారులు వస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ పేదలకు సన్న బియ్యం ను అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. అలాంటి లక్ష్యం ను తూట్లు పొడాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మ కోర్లకుంట్ల నాగేశ్వరరావు, కట్టుకాచారాం సర్పంచ్ సైదులు, వీరబాబు, లక్క నాగరాజు, కోసూరి పానకాలు, రాజబాబు, బోయిన గురవయ్య,భోయిన రేణుకరావు. బోయిన నరసింహారావు, బ్రహ్మం, రామకృష్ణ, కిట్టయ్య, కమలాకర్, బోయిన నాగరాణి, మేకల భద్రమ్మ, మాణిక్యం, శ్రీలత, మేకల లక్ష్మి, శ్రావణి, ఉత్తరమ్మ, సుకన్య, లీలావతి, త్రివేణి పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి విన్నపం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పలు డిమాండ్లను అధికారుల ముందు ఉంచారు. ప్రధాన డిమాండ్లు: యూరియా పంపిణీ: ఎఫ్ఎఫ్ఎస్ (FFS) యాప్ ద్వారా యూరియా పంపిణీ చేసేటప్పుడు, జిల్లాను యూనిట్‌గా కాకుండా, మండలం లేదా సమీప మండలాల సమూహాన్ని యూనిట్‌గా పరిగణించి పంపిణీ చేయాలి. యాప్ బుకింగ్: రైతు వేదికల్లో ఏఈవోలు అందుబాటులో ఉండే పనివేళల్లో యాప్ బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచి, రైతులకు బుకింగ్ ప్రక్రియలో సహాయం అందించాలి. సాగునీరు: వైరా కాలువ ద్వారా టెయిల్ ఎండ్ గ్రామాల వరకు సాగునీరు అందించేలా చూడాలి. అలాగే, గ్రామాల వారీగా నీటి విడుదలకు సంబంధించి ప్రత్యేక రోటేషన్ షెడ్యూల్ ప్రకటించాలి. పంట నమోదు: ఖరీఫ్ పంటల నమోదులో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని విడనాడాలి. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి రైతులందరి పంటలను వెంటనే నమోదు చేయాలి.మద్దతు ధర: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ముందుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. గన్నీ సంచులు, తూకం, రవాణా, సకాలంలో చెల్లింపులు జరిగేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి.ఈ వినతులపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సమస్యలను వెంటనే పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందించినందుకు జిల్లా కలెక్టర్‌కు డాక్టర్ బానోత్ చంద్రావతి కృతజ్ఞతలు తెలిపారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌పై స్టే ఎత్తివేయాలి

**పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించాలి**

**బోనకల్ బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**

**బోనకల్ తహసీల్దార్‌కు వినతి పత్రం**




**బోనకల్, ఆగస్టు17(ప్రజా జ్యోతి):** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ హైకోర్టు విధించిన స్టేను వెంటనే ఎత్తి వేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని బోనకల్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బోనకల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వ ర్యంలో నిరసన చేపట్టి, అనంతరం బోనకల్ తహసీల్దార్ చల్లూరి సుధాకర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి బానోతు కొండ మాట్లాడుతూ.. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ హయాంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరం తరంగా అమలై, పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక అండగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కోర్టు స్టే కారణంగా ఇప్పటికే వివా హాలు చేసుకున్న అర్హులైన పేద కుటుం బాలు ఆర్థిక సహాయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవే దన వ్యక్తం చేశారు.

**తులం బంగారం హామీ ఏమైంది.?**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమ యంలో ఆడబిడ్డ వివాహానికి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీ అమలు సంగతి పక్కన పెడితే గత ప్రభుత్వం అమలు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధి కూడా సకాలంలో అందడం లేదని విమర్శించారు. పేద కుటుంబాల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. హైకోర్టు స్టే నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయ నిపుణులతో సంప్ర దించి రివ్యూ పిటిషన్ లేదా తగిన న్యాయపరమైన చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు నష్టం కలగ కుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పథకాలపై నెలకొన్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి లబ్ధిదారు లకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు రాజకీయాలకు అతీతంగా పేద కుటుంబాల సంక్షేమానికి సంబం ధించినవని, పేదింటి ఆడబిడ్డల జీవితా లతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు మాజీ మండల కన్వీనర్ వేమూరి ప్రసాదు, మాజీ మండల కార్యదర్శి పారా ప్రసాదు, కాకాని శ్రీని వాసరావు ఇటికల శ్రీనివాసరావు, గద్దల వెంకటేశ్వర్లు ,వెంగళ కనకయ్య ,రాజారావు, కేతినేని సత్యనారాయణ ,ఎంపీటీసీ ముక్కపాటి అప్పారావు, ఎనమద్ది శ్రీనివాసరావు, ఎస్ కే మీరా సాహెబ్, మరీద్ శేషు తెల్లూరి రమేష్, మల్లెల వేలాద్రి, బీఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారి కి వైద్యానికి చేయూతగా రూ..3 లక్షల ఎల్.ఓ.సి



**సత్తుపల్లి ఆగస్టు17(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని కొత్తూరు పంచాయ తీలో తోట ఫణి కుమార్ వారి కుమార్తె చిన్నారి షుగర్ వ్యాధితో బాధపడు తుంది. ప్రత్యేకమైన వైద్య పరికరం అవసరం కావడంతో సత్తుపల్లి శాసన సభ్యు రాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ వారి దృష్టికి తీసుకెళ్లారు. గమనిం చిన వారు సోమవారం రూ..3 లక్షల రూపాయల ఎల్ఓసి చెక్కును ఫణి కుమార్ కు అందజేసినారు. ఈ విధంగా వైద్యానికి సహాయం చేయటం పట్ల కాంగ్రెస్ పార్టీకి,ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా మాట్లాడుతూ ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడం మానవ ధర్మం అని,పేద ప్రజల కోసమే కాంగ్రెస్ పార్టీ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అయినంపూడి శ్రీనివాసరావు,ఉపసర్పంచ్ గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు ఉన్నారు.

## నేరేడ బాలరాజుకు ఘన నివాళులు

**నివాళులర్పించిన మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ**




**బోనకల్, ఆగస్టు 17(ప్రజా జ్యోతి):** నేరేడ బాలరాజు మృతదేహానికి మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ పూలమాల వేసి సోమవారం ఘనంగా నివాళులర్పిం చారు. అనంతరం బాలరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా బానోతు కొండ మాట్లాడుతూ.. బాలరాజు మృతి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. నివాళులర్పించిన వారిలో వేమూరి ప్రసాద్, బాజీ, మున్న, సిద్దు, భూషి, పత్తి పాటి సురేష్, నవీన్, సంపత్, షేక్ జాన్ పాషాతో పాటు రైల్వే సిబ్బంది తదిత రులు ఉన్నారు.

## పారిశుద్ధ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**సిఐటియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు,**



**ఎర్రుపాలెం ప్రజాజ్యోతి** పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని వేత నాలు పెంచి,2వ పిఆర్సీలో గుర్తింపు తదితర సమస్యలు పరిష్కరించాలని సిఐ టియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆగస్టు– 18,19తేదీలలో ఎర్రుపాలెం మండల ప్రజా పరిషత్ కార్య లయాల వద్ద దీక్షలు చేపడుతున్నట్టు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో శారదకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మద్దాల ప్రభా కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ పంచాయతీ కార్మికులు సేవలందిస్తున్నారని అన్నారు.అటువంటి పారిశుధ్య కార్మికులు ఏళ్ళ తరబడి పని చేసినా పనికి భద్రత, పర్మినెంట్,కనీస వేతనాలు,పిఎఫ్, ఇఎస్ఐ,ప్రమాద బీమా లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు.రాష్ట్రంలో కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పంచాయితీ కార్మికులందరిని పర్మినేంట్ చేసి కనీస వేతనాలు అమలు చేస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినప్ప టికి అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు కావస్తున్న నేటికీ పర్మినెంట్ చేయలేదని విమర్శించారు. గ్రామ పంచాయతీ కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు.పని భారాన్ని పెంచే జీవో నెం 51 సవరణ, మల్టీపర్సన్ వర్కర్ విధానం రద్దు చేయాలని,కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటల్ కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హమి ప్రకారం గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల అకౌంట్లలో వేతనాలు జమ చేయాలని వయస్సు పైబ డిన,అనారోగ్యం పాలైనా,మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యు లకు పని కల్పించాలని అన్నారు. ఆన్ లైన్ లో నమోదు కాని కార్మికుల పేర్లు నమోదు చేయాలని అక్రమంగా సిబ్బందిని తొలగిస్తున్న సర్పంచుల పైన ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా చట్టపరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. మరణిం చిన కార్మికుని దహన సంస్కారాలకు కనీసం 30,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని పంచాయతీ కార్మికులందరికి సంక్షేమ పథకాలు అమలు పరచాలని ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసమే దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గామాసు జోగయ్య, గ్రామపంచాయతీ కార్మిక మండల అధ్యక్ష కార్యదర్శులు గంతాల నాగేశ్వరరావు, కలపాల రవీందర్, బాజీ,మైనర్ బాబు,రవీంద్ర బాబు,ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడల సన్నహాక సమావేశం



**ఎర్రుపాలెం ప్రజాజ్యోతి** మండల స్థాయి పాఠశాలల క్రీడలు సన్నాహక సమా వేశం సోమవారం ఎరుపాలెం మండల విద్యాశాఖ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. 2026–27 పాఠశాలల క్రీడల్లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భీమవరంలో సెప్టెంబరు 7–8..తేదీల్లో మండల స్థాయి పాఠశాల క్రీడలు జరుగును. సీనియర్ విభాగం బాలబాలికలు, జూనియర్ విభాగం బాలబాలికలు కబడ్డీ, ఖో –ఖో,వాలీబాల్, అట్లాటిక్స్, నిర్వహించబడును. మండలంలో విజేతను జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటాయి అని మండల విద్యాశాఖ అధికారి మురళీమోహన్ రావు, సోమ వారం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు మారాబత్తుల జములయ్య, గూడూరు సత్యనారాయణ రెడ్డి, నరాల సాంబశివరెడ్డి, మారాబత్తుల నాగేశ్వ రరావు, త్రిపుర, గోపిరెడ్డి, జహీరా, రవికుమార్, వేణు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**సిఐటియు జిల్లా నాయకులు బోయినపల్లి వీరబాబు, మండల కన్వీనర్ గుగులోతు నరేష్**

**ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేసిన సిఐటియు నాయకులు**



**బోనకల్, ఆగస్టు 17(ప్రజా జ్యోతి):** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరి ష్కరించాలని కోరుతూ ఈనెల 18, 19 తేదీల్లో గ్రామపంచాయతీ కార్మికుల రిలే నిరాహార దీక్షల చేపడుతున్న సందర్భంగా సోమవారం బోనకల్ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సిఐటియు ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు బోయినపల్లి వీరబాబు, మండల కన్వీనర్ గుగులోతు నరేష్ మాట్లాడుతూ.. సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులకు సమాన పనికి సమానమైన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం పెంచి, వారికి తగిన సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని సవ రించాలని, పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రమాద భీమా, ఆరోగ్య భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహ ణను బహిష్కరించి నిరసన తెలుపనున్నట్లు వారు అన్నారు. వినతి పత్రం అందజే సిన వారిలో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్మికులు ఉన్నారు.

# ఖమ్మం జిల్లాలో ని ప్రైవేట్ హాస్పిటల్ మాధవి క్లినిక్,శ్రీనివాస్ నగర్, డాక్టర్ హెల్త్ హోమియోపతి, మిత్ర డయాగ్నస్టిక్ సెంటర్ లను,జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి,డాక్టర్ డి. రామారావు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాస్పిటల్‌లో అందిస్తున్న వైద్య సేవలు,వైద్యులు, సిబ్బంది వివరాలు, రోగుల రికార్డులు,రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు,ఫైర్ సేఫ్టీ,బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, ఔషధాల నిల్వ, ల్యాబొరేటరీ, ఇతర సంబంధిత రికార్డులను పరిశీలించారు.హాస్పిటల్‌లో క్లినికల్ ఇష్టబ్లిషమెంట్స్ యాక్ట్,ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సూచించారు.రోగులకు నాణ్యమైన వైద్య సేవలు,పారదర్శకమైన చికిత్స,పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని హాస్పిటల్ యాజమాన్యానికి సూచించారు.తనిఖీ సందర్భంగా గుర్తించిన అంశాలపై అవసరమైన వివరాలు సమర్పించాలని హాస్పిటల్ యాజమాన్యాన్ని ఆదేశించారు.నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు.ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్,డయాగ్నస్టిక్ కేంద్రాలు తదితర వైద్య సంస్థలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రోగుల భద్రత,నాణ్యమైన వైద్య సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.

## సిసి రోడ్డు శంకుస్థాపన చేసిన

**ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ జైయె లుసి**

**VB_G_RAMG గ్రాంట్ తో సిసి రోడ్డు కు శంకు స్థాపన**





**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 17** కామేపల్లి మండలంలోని ముచ్చర్ల గ్రామ పంచాయతీ నందు విబిజి రాంజీ గ్రాంట్తో సాంక్షన్ అయిన సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన ముచ్చర్ల సర్పంచ్ జైయె లూసి పంచాయతీ పరిధిలో ఉన్న బీసీ కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేయడం జరిగింది మరియు రైతు భూములలో పంట పంటకు ముగ్గు వేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ గ్రామపంచాయతీ సెక్రటరీ పి అనురాధ మరియు గ్రామ ఉపసర్పంచ్ ఆర్ మా వార్డ్ మెంబర్స్ మరియు గ్రామ పెద్దలు మరియు ప్రజలు ఈ శంకుస్థాపన సీసీ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

**ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా**



**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వేలాది కుటుంబాలకు అండగా నిలిచాయని నాయకులు పేర్కొన్నారు. అయితే ఈ పథకాల అమలుకు సంబంధించి హైకోర్టులో దాఖలైన కేసు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లన మధ్యంతర ఉత్తర్వులు వెలువడటంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఇప్పటికే వివాహాలు చేసుకున్న పేద కుటుంబాలు, వివాహాలకు సిద్ధమవుతున్న ఆడబిడ్డల తల్లిదండ్రులు ఈ పరిణామంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం తక్షణమే న్యాయపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుకు సంబంధించి ప్రభుత్వం వెంటనే సమగ్ర కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసి, పథకాల కింద లబ్ధిదారులకు అందాల్సిన ఆర్థిక సాయం నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అర్హత సాధించిన లబ్ధిదారులకు రావాల్సిన ఆర్థిక సహాయాన్ని ఆలస్యం చేయకుండా అందించాలని కోరారు. పేదల ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచే ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయొద్దని, ప్రభుత్వం తక్షణమే స్పందించి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిరంతరాయంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ పథకాలపై ఆధారపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం స్పష్టమైన భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు గూడూరు రమణారెడ్డి, శేగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కుడుముల మల్లికార్జున రెడ్డి,బొర్ర నరసింహారావు, యరమల కృష్ణారెడ్డి, గద్దల శ్రీనివాసరావు, వేమిరెడ్డి బ్రహ్మనందరెడ్డి, కూరపాటి నాగేశ్వరరావు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కామేపల్లి ఎమ్మార్వో మరియు ఎండిఓ గారికి వినతి పత్రం అందజేసిన కామేపల్లి మండల బిఆర్ఎస్ నాయకులు

**కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలి**



**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 17** కామేపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య వైఖరి విధానానికి నిరసనగా బి.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులు కామేపల్లి ఎండిఓ మరియు ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి చేయడం జరిగింది కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వము విధానం ప్రభుత్వ నిర్లక్ష్య విధానాన్ని నిరాశిస్తూ భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ గారు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల లో నిరసన కార్య క్రమాలు నిర్వహించాలని ఇచ్చిన పిలుపుమేరకు ఇల్లందు మాజీ శాసన సభ్యురాలు ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శాసన సభ్యురాలు బిఆర్ఎస్ ఇంచార్జ్ శ్రీమతి భాను హరి ప్రియ నాయక్ గారి ఆదేశాల మేరకు కామేపల్లి మండల మాజీ అధ్యక్షులు అంతోటి అచ్చయ్య సామ మోహన రెడ్డి మల్లెంపాటి శ్రీనివాస్ కాట్రాల రాంబాబు ఒడియాల కృష్ణారెడ్డి మూడు కృష్ణ ప్రసాద్ బోడంపుడి బుజ్జిబాబు ముఖ్య నాయకులు పార్టీ శ్రేణులతో కలిసి కామేపల్లి ఎండిఓ కార్యాలయం మరియు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి ఎమ్మార్వో గారికి వినతి పత్రాన్ని అందించడం జరిగింది ఏడింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసేందుకు పన్నాగం పన్నుతుందని కళ్యాణ్ లక్ష్మి అంశంలో ఇప్పటివరకు హైకోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని ప్రశ్నించారు అధికారంలోకి వచ్చిన తర్వాత లక్ష రూపాయలతో పాటు ఆడపిల్లలకు తులం బంగారం ఇస్తారని హామీ ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వము ఇవ్వలేదని అది కాకుండా ఇప్పుడు పూర్తిగా కళ్యాణ లక్ష్మి పథకాన్ని ఎత్తివేసే విధంగా పావులు కదుపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతు బీమా ఊసే లేదని యూరియా కొరత గురించి చెప్పాల్సిన అవసరం లేదని రైతుబంధు కూడా బందు చేసిందని ఇప్పుడు కొత్తగా కోర్టులో పిటిషన్లు వేసి కళ్యాణ లక్ష్మి పథకానికి మంగళం పాడే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ పనుల్లో విసుకు చెందారని రాబోయే కాలంలో కచ్చితంగా బుద్ధి చెప్పి తీరుతారని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సర్పంచులు నాగమణి కిషన్ గడ్డం వెంకటేశ్వర్లు మన్యం వెంకటేశ్వర్లు కన్నమల రాంబాబు షేక్ నాగుల్ మీరా కొనకంచి శంకర్ ముత్యబోయిన రామ్మూర్తి ఆధుని ప్రసాద్ మంచాల వెంకన్న తాడుపల్లి నరసరావు మందా రాజుపాలెం మధు భానుత రవి లకవత్ బీమా తదితరులు పాల్గొన్నారు

# తొండల గోపవరం లో ఉచిత క్యాన్సర్ శిబిరం



**మదిర ప్రజా జ్యోతి** మండలం తొండల గోపవరం గ్రామపంచాయతీలో ఉచిత క్యాన్సర్ శిబిరాన్ని సర్పంచ్ షేక్ కన్నం సాహెబ్ మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ డాక్టర్ శ్రావణ్ కుమార్ లు సోమవారం ప్రారంభించారు ఈ సందర్భంగా అద్దంకి రవికుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంతాలలో మహిళలు ఎక్కువగా క్యాన్సర్ మహమ్మారికి గురవుతున్నారని అటువంటి వారిని లక్ష్యం చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలకు మరియు పురుషులకు 20వేల వరకు విలువచేసే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ముందుకు రావడం చాలా సంతోషకరమని మహిళలు ఈ వ్యాధి గురించి డాక్టర్ కు చెప్పుకోవడానికి సిగ్గుతో భయంతో వ్యాధి ప్రారంభ దశలోనే నిర్ధారణ చేసుకోవడంలో విఫలం అవడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతూ ఉన్నారని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండటం కొరకు ఈ శిబిరం ఎంతగానో సహాయపడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ మైకేల్ స్టాఫింగ్ నర్స్ కళ్యాణి రవళి ఈశ్వర్ చంద్ర మధు స్థానిక వైద్యాధికారులు కోట వెంకటేశ్వరరావు ఏఎన్ఎం లు భారతి నాగమణి ఆశ కార్యకర్తలు వేల్పుల విజయ షేక్ నాగూర్ బి నాగమణి స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు నరెడ్ల వెంకటరెడ్డి సూర్యదేవర వెంకటేశ్వరరావు వాసిరెడ్డి వెంకట్రావువార్డు మెంబర్లు బొబ్బిళ్ళ వీర వెంకయ్య మేడేపల్లి భవాని శివ చేబ్రోలు కృష్ణ చేబ్రోలు సాంబయ్య మేడేపల్లి మాధవరావు తలుపుల నాగేశ్వరావు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రజావాణిలో తమ సమస్యలు తెలుపుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.రఘునాధపాలెం మండలం పాపటపల్లి గ్రామానికి చెందిన చౌడవరపు దుర్గమ్మ తన కుమారుడు తనను అనేక బాధలు పెడుతున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కల్లూరు మండలం ఓబులరావు బంజర గ్రామానికి చెందిన భూక్యా మురళీ తాను శారీరకంగా దివ్యాంగుడినని తాను డిగ్రీ బీకాం కంప్యూటర్ చదివానని తనకు ఏదైనా ప్రభుత్వ శాఖలో ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన రైతులు సర్వేనెంబర్ 19 లో తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వ్యవసాయం సాగు చేసుకుంటున్నామని, సర్వే నెంబర్ 19 అటవీ భూమికి సరిహద్దున ఉన్నందున పట్టా పాస్ పుస్తకాలు రాలేదని, 1950 మ్యాపు ప్రకారం తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ చర్యలు తీసుకోవాలని తెలిపారు.మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమకు నాలుగు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్,ఎస్ ఈ మిషన్ భగీరథకు రాస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన కే. ఉపేందర్ తాను రెండు సంవత్సరాలుగా ర్యాపిడో బైక్ నడుపుకుంటున్నాని, ఎస్సీ కార్పొరేషన్ లో ఆటో కొరకు దరఖాస్తు చేసుకున్నానని చాలా పేదరికంలో ఉన్నానని తనకు ఆటో ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారికి రాస్తూ పరిశీలించి అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు,కలెక్టరేట్ ఏఓ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# కోర్టు ఆదేశాలతో మహిళలకు 3 ఎకరాల భూమి అప్పగింత

**- తహసిల్దార్, సిఐ ఆధ్వర్యంలో భూమి హద్దులతో అప్పగింత**



**కారేపల్లి, ఆగస్టు 17, ప్రజా జ్యోతి:** ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న భూ వివాదానికి కోర్టు ఆదేశాలతో తెరపడింది. సింగరేణి మండలం ఉలివికాయలపల్లి గ్రామంలో సర్వే నంబర్ 548/37/5/4లోని 3 ఎకరాల భూమిని గిరిజన మహిళ బానోతు లక్ష్మికి రెవెన్యూ, పోలీస్, సర్వే శాఖల అధికారులు సమక్షంలో సోమవారం అప్పగించారు. కోర్టు ఆదేశాల మేరకు తహసిల్దార్ వి.వెంకటేశ్వర్లు, రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకుని భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. అనంతరం బాధితురాలికి భూమి స్వాధీనం అప్పగించడంతో స్థానికంగా హర్షం వ్యక్తమైంది. భూమి విషయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సింగరేణి సీఐ ఎన్.సాగర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు సమస్యను శాంతియుతంగా పరిష్కరించి, కోర్టు ఆదేశాలను అమలు చేశారు. సింగరేణి మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో సర్వే నంబర్ 548/37/5/4లో ఉన్న భూమిపై చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత రెవెన్యూ, పోలీస్, సర్వే శాఖల అధికారులు మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. భూమిని పరిశీలించి, సర్వే నిర్వహించి హద్దులను గుర్తించారు. అధికారుల సమక్షంలో 3 ఎకరాల భూమిని గిరిజన మహిళ బానోతు లక్ష్మికి అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు ముందస్తు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను అమలు చేయడమే తమ బాధ్యత అని తెలిపారు. భూమి తమకు దక్కడంతో బానోతు లక్ష్మి కుటుంబ సభ్యులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నాళ్లుగా కొనసాగుతున్న సమస్య పరిష్కారం కావడంతో గ్రామంలో సంతృప్తి వ్యక్తమైంది

# జానీ మియా మృతదేహానికి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ నేతలు

**జానీమియా మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం**



**రఘునాధపాలెం ప్రజా జ్యోతి** రఘునాథ పాలెం మండలం చిమ్మపూడి గ్రామ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు షేక్ జానీ మియా(48) గుండె పోటుతో మృతి చెందిన జానీ మియా మృతదేహానికి నివాళులు సోమవారం అర్పించిన ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు. మాజీ మంత్రి పువ్వాడ వ్యక్తిగత సహాయకులు చిరుమామిళ్ల రవికిరణ్, బీఆర్ఎస్ నాయకులు వీరునాయక్, బచ్చు విజయ్ కుమార్, గుత్తా రవి, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి తదితరులు జానిమీయాకు నివాళులు అర్పించారు. జానీమియా కుటుంబ సభ్యులకు ఫోన్లో మాట్లాడి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన పువ్వాడ.. పార్టీ అండగా ఉంటుందని పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం తెలిపారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి..! వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలిస్తాం..:ఎంపీడీవో అశోక్ కుమార్



**రఘునాధపాలెం: ప్రజా జ్యోతి** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని రఘునాధ పాలెం ఎంపీడీవో అశోక్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 7 రకాల సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. రఘునాధపాలెం మండలం ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు వైద్య ఆరోగ్య శాఖకు, మండల పంచాయతీ విభాగానికి సంబంధించి రెవెన్యూ విభాగానికి ,గృహనిర్మాణ శాఖ, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలిస్తాం, పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణి కి 17 శాఖల అధికారులు హాజరవుతారని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ శ్వేత సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సిపీఎస్ ను వెంటనే రద్దు చేయాలి

**జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్. బ్రహ్మా రెడ్డి**



**మధిర ప్రజాజ్యోతి** పిఆర్సి పెండింగ్ డిఎ లను విడుదల చేయాలని సిపిఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పిఆర్టియు ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాకు మధిర, ఎర్రుపాలెం మండలశాఖల ఆధ్వర్యంలోభారీ సంఖ్యలో ఉపాధ్యాయులు తరలి వెళ్లినట్లు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్. బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు దాటిందనిమేనిఫెస్టోలో పేర్కొని ఇప్పటివరకు కూడా హామీలు నెరవేర్చకపోవడంతో పి ఆర్టియు ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించాల్సి వచ్చిందని ప్రభుత్వం మాట నిలుపుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఖమ్మం ధర్నాకు మధిర మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పోలేసుధాకర్ ఎర్రుపాలెం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.మదన్మోహన్ రెడ్డి యం.బాబురావు జిల్లా బాధ్యులు సిహెచ్ వి. రవికుమార్ కొమ్ము శ్రీనివాసరావు ఎస్.సంగిరెడ్డి వి. నాగరాజు మధిర ఎర్రుపాలెం మండల బాధ్యులు పిల్లినరసింహారావు ఎండి జమీర్, పిడిపి జ్యోతి టి .అనసూయ కె.రాఘవరావు, జి చిన్నప్ప మండల బాధ్యులు నేతృత్వంలో మధిర ఎర్రుపాలెంమండలాల నుండి ఖమ్మం ధర్నాకు బారీగా బయలుదేరి వెళ్లారని బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు.

# నేడు కోట మైసమ్మ జాతరలో దుకాణంల వేలం పాటలు



**కారేపల్లి, ఆగస్టు17, ప్రజాజ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి లో గల కోట మైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో రాబోవు దసరా పండుగ సందర్భంగా నిర్వహించే దుకాణాల వేలం పాటలు నేడు మంగళవారం జరగనున్నాయని ఆలయ ధర్మకర్త పర్సపట్టాభిరామారావు, ఈవో కే. వెంకటయ్య సోమవారం ఒక ప్రకటన తెలిపారు.దసరా పండుగ సందర్భంగా జాతరలో పుట్నాలు, మిఠాయిలు విక్రయించే దుకాణాల సముదాయాలకు వేలంలో పాడుకునే వారిని వేలంపాటలకు ఆహ్వానించారు. సకాలంలో వ్యాపారులు పాటలకు హాజరై ఆలయ నియమ నిబంధన ప్రకారం పాటలు పాడుకోగలరని వారు తెలిపారు.

# గూడూరు గ్రామంలో దశ దీన కర్మ కార్యక్రమం లో పాల్గొన్న వేంసూరు మట్టా



**వేంసూరు ఆగస్టు 17 ప్రజాజ్యోతి** <మండలం గూడూరు గ్రామం లో పెద్దలు రావుల వెంకటేశ్వరరావు సతీమణి రావుల సీతమ్మ దశ దీన కర్మ కార్యక్రమం లో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఈ కార్యక్రమం లో వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, గూడూరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వేంసూరు మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు